# ఒడిలో విడిచిన పసితనం

"అయితే త్రివేంద్రం నించీ అన్నయ్య ఎప్పుడొస్తాడు?" అడిగింది ప్రసూన, భోజనానంతరం పూర్ణమ్మగారి పక్కనే మంచం మీద కూర్చుని.

ఆవిడ తన ధోరణిలో బోసినోటితో చిరునవ్వు నవ్వి - "వస్తాడు వీలు చూసుకుని. ఏదో పియ్యెస్సెల్వి అనో ఏదో చెప్పాడు. ఇంకో పదిరోజుల్లో ఆ రాకెట్‌ని శ్రీహరికోట నించీ పంపిస్తున్నారుట. అదవగానే ఇక్కడికి వస్తానన్నాడు" అన్నది పూర్ణమ్మగారు.

ప్రసూన రెండు రోజుల ముందే వచ్చింది అమెరికానించి, ఒక నెల రోజులు ఇండియాలో తల్లి దగ్గర గడిపి వెడదామని. పిల్లలకి స్కూలు వుండటం వల్లా, వాసుకి శెలవు లేక పోవటం వల్లా తను ఒక్కత్తే వచ్చింది.

"అవును. నేను చికాగో నించి ఫోన్ చేసినప్పుడూ అదే చెప్పాడు. ఆ రాకెట్ లాంచింగ్ అవగానే, ఇక్కడికొచ్చి నాలుగు రోజులుండి, తర్వాత మనమందరం త్రివేంద్రం వెడదామని చెప్పాడు. నేను అటునించి అటే అమెరికా వెళ్ళిపోతాను" అన్నది ప్రసూన.

"ప్రకాష్ నన్ను త్రివేంద్రం రమ్మనీ, అక్కడే వాళ్ళతో వుండి పొమ్మనీ చాల సార్లు అన్నాడు కానీ, ఎందుకో వెళ్ళ బుద్ధి కావటం లేదమ్మా!" పూర్ణమ్మగారు అన్నది నెమ్మదిగా.

ప్రసూన సాలోచనగా అడిగింది "వదిన బాగానే చూసుకుంటుంది కదా! "అని.

పూర్ణమ్మగారు మళ్ళీ నవ్వింది. "సులోచన గురించి మరీ గొప్పగా చెబితే ఆయుఃక్షీణం అని చెప్పటం లేదు కానీ, మీ వదిన చాల మంచిదమ్మా. చక్కగా చూసుకుంటుంది. అలాగే పిల్లలూనూ. బామ్మ బామ్మ అంటూ ఒక్కక్షణం వదిలిపెట్టరు"

"మరి నువ్వొక్కదానివే ఎందుకిక్కడ? అక్కడే హాయిగా వుండొచ్చుకదా! సముద్రపు ఒడ్డున అక్కడ క్వార్టర్స్‌లో బాగుంటుంది కూడాను" అన్నది ప్రసూన.

"అవుననుకో...." అన్నది పూర్ణమ్మగారు, పెదవుల మీద ముసిముసి నవ్వుని పూర్తిగా కనపడనీయకుండా.

ప్రసూన పకపకా నవ్వింది. "నీ భయం నాకు తెలుసు లేవే అమ్మా! స్వంత ఊళ్ళోనూ, స్వంత ఇంట్లోనూ, కాకుండా ఇంకెక్కడయినా వుంటే, అక్కడే పోతావే మోనని నీ భయం. అందుకేగా అమెరికా వచ్చి మా దగ్గర వుండమన్నా అక్కడికి రావు నువ్వు!"

పూర్ణమ్మగారు చిరునవ్వు నవ్వింది కానీ, ఏమీ మాట్లాడలేదు.

"నీ వయసుకి నువ్వెంత ఆరోగ్యంగా వున్నావో తెలుసా? ఏవో పెద్ద వయసులో మామూలుగా వచ్చే, కీళ్ళ నెప్పులూ నడుం నెప్పులూ తప్ప, నీకువేరే ఏమీ లేవు. త్రివేండ్రం వెళ్ళి అన్నయ్య దగ్గర వుంటే నీకూ హాయిగా వుంటుంది. నాకూ నీ గురించి బెంగ వుండదు"

పైకి ప్రసూన అలా అన్నదే కానీ, ఆవిడకి ఆ ఊళ్ళోనే ఆ ఇంట్లోనే వుండాలనే కోరిక ఎంత బలంగా వుందో తనకూ తెలుసు. అందుకే అక్కడినించీ కదలదు. త్రివేండ్రం నించీ ప్రకాష్, సులోచన, పిల్లలూ ప్రతి సంవత్సరం వచ్చి కొన్నాళ్ళు వుండి వెడుతూనే వుంటారు. పూర్ణమ్మగారు ఒకటి రెండు సార్లు త్రివేండ్రం వెళ్ళింది కానీ, ఎక్కువ రోజులు వుండకుండానే వెనక్కి వచ్చేసింది.

"నేను డబ్బులు పంపిస్తానంటే వద్దంటావు. అన్నయ్య దగ్గరా తీసుకోవు. మరి నీకు ఇక్కడ ఏమీ ఇబ్బందులు లేకుండా వుంటున్నదా?" అడిగింది ప్రసూన.

"నాకు డబ్బులెందుకమ్మా? మీ నాన్నగారు పోయిన దగ్గరనించీ, అంటే పది హేడేళ్ళుగా, ఆ ఫామిలీ పెన్షన్ డబ్బులు వస్తూనే వున్నాయి. ఈ మధ్య పదిహేను వందల దాకా పెంచారు తెలుసా?" అన్నదావిడ. ఆ మాట అంటున్నప్పుడు ఆవిడ కళ్ళల్లో ఒక చిన్న మెరుపు మెరిసింది. అది ఎక్కువ డబ్బులొస్తున్నాయని కాదు. ఎన్నేళ్ళ క్రితమో భర్త పోయినా ఇంకా ఆయన పేరుతో పెన్షన్ డబ్బులు వస్తున్నాయని. స్వర్గంలో వున్నా ఆయన ఇంకా తనని ఆర్థికంగా నిలబెడుతున్నాడని. అందుకే ఆవిడ ప్రసూన దగ్గర నించీ కానీ, ప్రకాష్ దగ్గర నించీ కానీ, ఎంత అవసరం వచ్చినా కానీ తీసుకోదు. ఉన్నంతలో ఆ పెన్షన్ డబ్బులతోనే కాలక్షేపం చేస్తుంది. అంతేకాదు, పండగలకీ పబ్బాలకీ తన తాహతుకి తగ్గట్టు, మనవలకీ మనవరాళ్ళకీ ఏవో ఇస్తూనే వుంటుంది.

"మరి రోగాలూ రొష్టులూ వస్తే, నీకు ఇక్కడ తోడు కావద్దూ. ఎవరుచూసు

కుంటున్నారు?" తల్లి కష్టసుఖాల గురించీ, ఆరోగ్యం గురించీ, తన మనసుని తొలిచి వేస్తున్న విషయాలని ఒక్కటొక్కటే బయట పెడుతున్నది ప్రసూన.

మళ్ళీ తన ట్రేడ్‌మార్క్ చిరునవ్వుని, బోసినోటి మీద ఒక్క క్షణం చూపించి అన్నదావిడ. "దేశం కాని దేశానికి వెళ్ళి, వేరు వేరు వూళ్ళల్లో పిహెచ్‌డీలు చేసిన మీకే అక్కడ తోడు దొరికినప్పుడు, ఈ వూళ్ళోనే పుట్టి పెరిగిన దాన్ని నాకు తోడు లేక పోవటమేమిటే!"

ప్రసూన తన వేపే దీక్షగా చూడటం గమనించి, మళ్ళీ ఆవిడే అన్నది. "ఎవరే మిటి. మామయ్య లేడూ. వాడుండే తెనాలి గుంటూరుకి ఇరవై కిలో మీటర్ల దూరం. అవసరమై ఫోన్ చేస్తే, ఒక గంటలో వుంటాడిక్కడ. అయినా ఆ పనీ ఈ పనీ అంటూ, వారం వారం గుంటూరుకి వస్తూనే వుంటాడు. ఎప్పుడువచ్చినా నన్ను చూడకుండా వెళ్ళడు. నేనంటే వాడికి చాల ప్రేమ" అన్నది పూర్ణమ్మగారు.

మామయ్య అంటే కృష్ణమూర్తి మామయ్య. ఆయన పూర్ణమ్మగారి కన్నా నాలుగేళ్ళు చిన్న.

ప్రసూన చిన్నగా నవ్వి "అయితే ఇక్కడ సుఖంగానే వుంటున్నానంటావు" అన్నది.

"ఉన్న ఇద్దరు పిల్లలూ మంచి ప్రయోజకులైనారు. వాడు ఈ దేశంలో పెద్ద ఇంజనీరు. నువ్వు అమెరికాలో గొప్ప యూనివర్సిటీలో ప్రొఫెసర్‌వి. కూతురులాంటి కోడలు. కొడుకులాంటి అల్లుడు. ముత్యాల్లాంటి ఇద్దరు మనవలూ, పువ్వుల్లాంటి ముగ్గురు మనవరాళ్ళూ. ఆ మహారాజు పోతూ పోతూ ఏర్పాటు చేసిన పెన్షన్ డబ్బు లూ. చుట్టూతా కష్టాల్లో ఆదుకునే మనవాళ్ళు. కాలక్షేపానికో, మోక్ష సాధనకో వ్రాసు కునే ఈ రామకోటి. అంతకన్నా ఏం కావాలమ్మా నాకు" అన్నది పూర్ణమ్మగారు.

వయసు ముదిరాక ఆవిడ పూర్ణమ్మగారయింది కానీ, వయసులో వున్నప్పుడు ఆవిడ పేరు సంపూర్ణ. ఆవిడ కళ్ళల్లో జీవితం పట్ల ఒక విధమైన తృప్తి సంపూర్ణంగా కన పడింది ప్రసూనకి.

అమెరికాలో తను యూనివర్సిటీ ఉద్యోగంలోనూ, ఇంట్లోనూ ఎంతోసుఖం గా వున్నాననుకుంటున్నా... తనలో ఏదో అసంతృప్తి. ఏదో తపన. మరి తన తల్లి ఒంట రిగానే వుంటున్నా, తృప్తిగా వున్నానని అంటుంటే ప్రసూనకి వింతగా వుంది.

ఆమె మనసులోని మాట పూర్ణమ్మగారికి అర్థమయినట్టుగా వుంది. చిరునవ్వు నవ్వింది. తన చేత్తో ప్రసూన తలమీద మృదువుగా నిమిరింది. కానీ ఏమీ మాట్లాడలేదు.

కొంచెంసేపయాక అన్నది పూర్ణమ్మగారు "ప్రసూనా! పూర్వపు రోజుల్లోలా

మన బంగారం కొట్టతను చెప్పిన టైముకేవీ చేసి ఇవ్వటంలేదని రాజ్యంచెప్పింది. నువ్వు ఒక ఉంగరం చేయించుకో. డబ్బులు నేను ఇస్తాను. వేరే కొత్తషాపులు చాల వచ్చాయిట. అక్కడయితే రెడీమేడ్‌వి వెంటనే దొరుకుతాయి"

"నువ్వు నాకు కొనిపెట్టటమేమిటే! ఏమీ అక్కర్లేదు. ఆ డబ్బులు వుండనీ. అవసరానికి పనికొస్తాయి" అన్నది ప్రసూన.

"రేపు నీ కూతురు ఉద్యోగంలో చేరి నీకన్నా ఎక్కువ సంపాదిస్తున్నప్పుడు, దానికి నువ్వేమీ కొనిపెట్టవా? అది సంపాదిస్తున్నది కదా అని... ఆ ప్రేమలూ అనురాగాలూ అక్కడితో ఆగిపోతాయా? అలాగే ఇదీనూ " అన్నది పూర్ణమ్మగారు.

ఆవిడ నొచ్చుకున్నదేమో అని అనుమానం వచ్చి, ప్రసూన నెమ్మది అన్నది "అదికాదే అమ్మా! నువ్వేమీ ఇవ్వకుండానే నేను పెద్దదాన్నయానా.... నేనీ రోజు ఇలా వుండటానికి కారణం నువ్వు కాదూ! ఎందుకూ అనవసరంగా అని... "

"అనవసరమేమిటి నీ మొఖం. నువ్వు నాకు ఒక్కగానొక్క కూతురివి. నేను నీకేమీ రత్నాల హారాలు ఇవ్వటం లేదు. ఇవ్వలేను. ఏదో నా చేతనయింది ఇది మాత్రమే"

ప్రసూనకి ఆవిడ మాటలు వింటుంటే, అనురాగానికి అసలు నిర్వచనం ఒక అనుభూతిగా ఆమె హృదయంలో నిలిచింది.

ఆరోజు రాత్రి పడుకోబోయే ముందు, ప్రసూనని అడిగింది పూర్ణమ్మ "నిన్ను నీ దగ్గర వున్న పాత బట్టలు తెమ్మన్నాను, తెచ్చావా?" అని.

ప్రసూన నవ్వింది. "అన్నీ తెచ్చాను. ముందు ఒకే ఒక సూట్‌కేస్‌తో వద్దామనుకున్నదాన్ని, ఆ బట్టలు తేవటంకోసం ఇంకో బాగ్ కూడా తేవాల్సివచ్చింది. అవన్నీ మంచి బట్టలే. పొట్టయిపోయినవి కొన్ని. ఎక్కువైపోయినవి కొన్ని... " అన్నది.

"అవునమ్మా. అందుకే అవన్నీ తెమ్మన్నది. ఇక్కడ నిర్మల హృదయ్ అని ఒక సంస్థ వుంది. కలకత్తాలోని మదర్ థెరసా ఆశ్రమానికి సంబంధించినదిఅది. అక్కడ అనాథలూ, అవిటివాళ్ళూ, రకరకాల రోగులు వుంటారు. వాళ్ళకి వసతీ, భోజనం, వైద్య సదుపాయాలూ, అన్నీ ఆ సంస్థ వాళ్ళే చూస్తారు. చందాలు పోగుచేసి వాళ్ళ అవసరాలు తీరుస్తారు. కొందరు ధర్మాత్ములు బట్టలూ కావలసిన ఇతర వస్తువులూ ఇస్తారు. పోయిన సంవత్సరం, మన చంద్రం వచ్చినప్పుడు నన్నక్కడికి తీసుకు వెళ్ళాడు. అప్పటినించీ అడపాదడపా వెడుతూనే వున్నాను. ఏదో నా చేతనయినంత సేవ చేస్తున్నాను. వాళ్ళు చేస్తున్న ఆ యజ్ఞంలో ఒక చిన్న చెంచాడు నెయ్యి. అప్పుడే అనిపించింది ఈసారి నువ్వువచ్చేటప్పుడు పాత బట్టలు తెస్తే వాళ్ళకి ఇద్దామని. ఆ మాటే ప్రకాష్ తోనూ చెప్పాను కానీ, వాడికెప్పుడూ అలాటివి గుర్తుండవు. అయినా, ఈ వయసులో కాదు

ఇలాటి ధర్మకార్యాలూ, సేవలూ ఇంకా కొన్నాళ్ళు పోనీ.... అంటాడు. మంచిపన్లు చేయటానికీ, వయసుకీ సంబంధమేమిటీ " అన్నదావిడ ఆ రోజుకు రామకోటి పూర్తిచేసి పుస్తకం మూసేస్తూ.

తన అన్నని సమర్థిస్తూ అన్నది ప్రసూన. "ధర్మకార్యాలు చేయటానికి వయసు రావాలని కాదు. సమయం దొరకక. నాకూ ఏదో చాల చేయాలనివుంటుంది. కానీ.. బిజీ లైఫ్. ఎప్పుడు ఖాళీ దొరుకుతుందో ఏమో.. అలాటివిచేయటానికి... "

పూర్ణమ్మగారు ప్రసూనని వింతగా చూసింది. ఏమీమాట్లాడలేదు. కానీ ప్రసూనకి, ఆవిడ "అవునమ్మా. నిజమే. కానీ ఒంటి ఊపిరితో చచ్చిపోబోయే వాళ్ళు, మనకి సమయం దొరికేదాకా ఆగుతారా"అని అన్నట్టు అనిపించింది. అందుకే ప్రసూన కూడా ఏదో గిల్టీగా ఫీలయి, తను కూడా మౌనం వహించింది.

కాసేపయాక పూర్ణమ్మగారు అడిగింది ప్రసూనని. "మీరు అమెరికా వెళ్ళేటప్పుడు నాలుగేళ్ళల్లో వచ్చేస్తాం అని చెప్పి వెళ్ళారు. మీరు వెళ్ళి పదేళ్ళపైనే అయింది. అసలు వెనక్కి వచ్చే ఉద్దేశ్యం ఏమన్నా వుందా?" అని.

ప్రసూన నవ్వింది. "పి.హెచ్.డీ. కోసం వెళ్ళి ఇద్దరం అవి పూర్తి చేశాం.తర్వాత నేను యూనివర్సిటీ టీచింగ్‌లోనూ, వాసు రీసెర్చిలోనూ మునిగిపోయాం. తర్వాత పిల్లలు పుట్టటం, వాళ్ళు స్కూళ్ళల్లో చేరటం. ఏమిటోనమ్మా అమెరికాలో కాలం తొందరగా పరుగెత్తుతున్నది... " అన్నది.

పూర్ణమ్మగారు పకపకా నవ్వింది. "ఈ రెండుదేశాలూ ఎంత తూర్పూ పడమరల్లో వున్నా, కాలం అమెరికాలోనూ ఇండియాలోనూ ఒకే లాగా పరుగెత్తుతుంది ప్రసూనా. అక్కడా ఇక్కడా రోజుకి ఇరవై నాలుగు గంటలే! మీరు ఇండియాకి తిరిగి రావాలంటే రాలేరూ. మనసుంటే మార్గం వుండకపోదు"

"రావాలనే వుందమ్మా. కానీ పిల్లలకి తెలుగు చదవటం రాకపోవటం వల్ల, ఇక్కడికి వస్తే స్కూల్లో వెనకపడిపోతారు అంటారాయన"

"ఇక్కడా ఇంగ్లీష్‌లోనే చదువుకుంటున్నారు కదే పిల్లలు" అన్నది పూర్ణమ్మగారు.

"ఇంగ్లీష్‌లోనే వున్నా ఇక్కడి చదువులకీ అక్కడి చదువులకీ చాల తేడావుంది. ఎడ్జస్టవటం కష్టం. అందుకే పిల్లల కాలేజీ చదువులు అయిపోయాక, వాళ్ళని అక్కడ వదిలేసి వెనక్కి వచ్చేద్దాం అనుకుంటున్నాం"

"వాళ్ళని వదిలి వుండగలరా మరి" అడిగిందావిడ.

ప్రసూనకి అప్పుడే గుర్తుకొచ్చింది. తనకి డెలివరీ అవగానే అమెరికాలోని

పద్ధతి ప్రకారం తన వక్షస్థలం మీద నగ్నంగావున్న పసికందుని పడుకోబెట్టటం. అప్పుడే అర్థమయింది. తన శరీరంలోనించి వచ్చిన ఆ పసిపిల్ల, అదే శరీరంమీద తనకి ఆనుకుని పడుకునివున్నప్పుడు, తను అనుభవించిన మధురానుభూతి ఎంత మరుపురానిదో.

"ఉండాలంటే వుండాలి మరి! తప్పదుగా..." అన్నది. అన్నాక అనిపించింది. తన తల్లి తనని వదిలి వుండలేదూ. అలాగే మరి.

"అవును. ఉండాలంటే వుండాలి మరి. తప్పదుగా!" అన్నది పూర్ణమ్మగారు, చిరునవ్వుతో, ప్రసూన మనసుని తల్లి మనసుతో చదివేసి.

ప్రసూన చాలసేపటి వరకూ ఆ విషయమే ఆలోచిస్తూ, సన్నగా వెలుగుతున్న దీపాన్ని చూస్తూ, పడుకున్నది.

పూర్ణమ్మగారు నిద్రలోకి జారుకోవటం చూసి, ప్రసూన దోమలు రాకుండా "టైమవుట్" ప్లగ్ చేసి లైటార్పేసింది.

మర్నాడు ప్రొద్దున్న పదిగంటలకి పూర్ణమ్మగారూ, ప్రసూనా ఆటోలో బయ ల్దేరారు.

తను రామకోటి వ్రాసిన పది పుస్తకాలూ రామనామ క్షేత్రంలో ఇచ్చి, వాళ్ళు ఇచ్చిన ఇంకో పది కొత్త పుస్తకాలు తీసుకున్నది పూర్ణమ్మగారు. అక్కడినించీ అదే ఆటోలో, నిర్మల హృదయ్‌కి వచ్చారు.

ప్రసూన మొదటిసారిగా అలాటి ప్రదేశానికి వెళ్ళిందేమో, ఈ సృష్టిలో ఎన్ని రకాల రోగాలూ అవిటితనాలూ వుంటాయో తెలుసుకున్నది. కుష్టువ్యాధి సోకిన చేతు లకి వేళ్ళు లేని చిన్న పిల్లల దగ్గరనించీ... ముక్కూ మూతీ పూర్తిగా తినేసిన పెద్దవాళ్ళ దాకా... ఒళ్ళు జలదరించేలా వున్నారు వాళ్ళు. అనాథలైన ఆ పసిపిల్లల ముఖాలలో కోమలత్వం కన్నా, వాళ్ళ భవిష్యత్తు అంతా శూన్యమేనని చెబుతున్న నిరాశ కను గుడ్లులేని వాళ్ళ కళ్ళ గుంటల్లో స్పష్టంగా కనిపిస్తున్నది. అలాటి నిరుత్సాహులకి, ప్రేమానురాగాలు పంచుతున్న ఆ నిర్మల హృదయులు, దేవదూతల్లా వాళ్ళని అక్కున చేర్చుకుని వాళ్ళకి మానవత్వపు వెచ్చదనాన్ని అందిస్తూ సేద తీరుస్తున్నారు.

పూర్ణమ్మగారు, సరాసరి అక్కడవున్న ఆఫీసులోకి వెళ్ళగానే, క్రిష్టియన్ నన్ లాగా వున్న ఒకామె ఆవిడని నవ్వుతూ పలకరించింది.

"మా అమ్మాయి ప్రసూన" అంటూ ప్రసూనని పరిచయం చేసి, "అమెరికా నిం చి వచ్చింది. మీ పిల్లల కోసం బట్టలు తెచ్చింది" అంటూ ఆ బట్టల సంచీ అందించింది.

అవిడ ఇద్దరికీ ధన్యవాదాలు చెప్పింది. తర్వాత వారి సంస్థ కార్యకలాపాల గురించి చెప్పింది.

ఈలోగా ఇంకొక సిస్టర్ ఒక పసికందుని తీసుకుని అక్కడికి వచ్చింది. "మన ఆఫీసు వెనకాల ఎవరో ఈ పసికందుని వదిలేసి వెళ్ళారు సిస్టర్. ఏడవటానికి కూడా ఓపిక లేని ఈ పిల్లకి, ఒళ్ళు చల్లబడుతుంటే లోపలికి తీసుకువచ్చాం. ఈ పిల్ల పుట్టి ఒక రోజు కూడా అయినట్టు లేదు" అన్నది.

ఆవిడ ఆ పసికందు నాడి చూసి "సమయానికి చూడబట్టి సరిపోయింది కానీ లేకపోతే ఏమయిపోయేది. వెంటనే డాక్టర్‌గారికి చూపించండి" అన్నది.

ఆ పసిపిల్ల, ముఖం ఎర్రగా కందివున్నా, ముద్దొస్తున్నది.

ఆ పసిపిల్ల లేతముఖంలోకి చూస్తూ, "సిస్టర్" అని ఆవిడని పిలిచింది పూర్ణమ్మ గారు.

ఆవిడ పూర్ణమ్మగారి వేపు చూసింది చిరునవ్వుతో.

పూర్ణమ్మగారు చెక్‌బుక్ తీసి రెండు వేల రూపాయలకి చెక్కు వ్రాసింది. "ఇది వుంచండి. శ్రీరామనవమి వస్తున్నది కదా. మీ నిర్మల హృదయాలకి యథాశక్తి నేను చేస్తున్న ఉడుత సహాయం ఇది. అంతే..." అన్నది.

ఆవిడ ఆ చెక్ తీసుకుని "దేవుడు మిమ్మల్ని కాపాడుతాడు" అన్నది.

ఆవిడ వెనకనే ఒక అయిదేళ్ళ పిల్ల, వేళ్ళు లేని తన చేతిని పెదిమలు లేని తన నోట్లో పెట్టుకుంటుంటే, నోటి మీద ఈగలు పైకెగిరాయి.

పూర్ణమ్మగారికి ఆ పిల్లని చూసి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. "ఇంకా ఎక్కువ చందా ఇవ్వాలని వుంది కానీ, ఇప్పుడు కాదు" అని వెనక్కి తిరిగింది.

అదంతా చూస్తున్న ప్రసూన, ఏమనాలో తెలియక మరమనిషిలా తల్లి వెనకనే నడిచింది.

ఆటో ఎక్కగానే "బంగారం షాపుకి వెడదాం. ఉంగరం కొనుక్కుందువుగాని" అన్నది పూర్ణమ్మగారు.

కళ్ళనిండా నీళ్ళు తిరిగిన ప్రసూన, తల్లి ఒళ్ళో చేయి వేసింది.

"నీ ఒడిలో నించి లేచి నా కాళ్ళ మీద నిలబడ్డాక, నాలో పసితనం పోయి పెద్దదాన్నయ్యాననుకున్నాను. నీ ఒడిని విడిచానే కానీ నా పసితనాన్ని ఇంకా వదల్లేదమ్మా. ఇన్నాళ్ళూ నేను ఎదగలేదనిపిస్తున్నది. ఇవాళ నిన్ను చూస్తుంటే తెలిసొస్తున్నది నేను ఇంకా ఎంత పసిదాన్నో..."

ప్రసూన మాటలు అర్థంకాక "ఏమిటే నువ్వనేది?" అని అడిగింది ఆవిడ.

"నాకు నీ దగ్గరనించీ ఒకటి కావాలమ్మా. మరి నాకది ఇస్తావా?" అడిగింది ప్రసూన.

"ఏం! ఉంగరం ఇష్టంలేదా?" అడిగింది ఆవిడ అమాయకంగా.

"అంతకన్నా విలువైనది అది"

"ఏమిటే.. నువ్వూ నీ పిచ్చి మాటలూనూ.."

"అవతలి మనిషి కష్టాల్ని చూసి స్పందించావే... అలా స్పందించి, నీ దగ్గర డబ్బులు ఎక్కువ లేకపోయినా, ఒక పెద్ద చెక్కు వ్రాసి వాళ్ళ ప్రాణాలకి పండుగ తెప్పించావే... అది.. అది కావాలమ్మా నాకు. బంగారపు ఉంగరమో, డబ్బో కాదు నాకు కావలసింది. వాళ్ళకి ఆ డబ్బు ఇవ్వటానికి స్పందించిందే నీ మనసు.. అది కావాలమ్మా... ఇస్తావా?" అన్నది ప్రసూన, పూర్ణమ్మగారి కళ్ళల్లోకి చూస్తూ. ప్రసూన కళ్ళల్లోని నీళ్ళు బుగ్గల మీదుగా, పూర్ణమ్మగారి చేతుల్లో పడ్డాయి.

ప్రసూనని దగ్గరకి తీసుకుని, ఆమె తలను తన ఒడిలో పెట్టుకున్నది ఆవిడ.

పసిపిల్లలా తల్లి ఒడిలో వెచ్చగా పడుకున్నది ప్రసూన.